www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్
Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు
ఉపకులపతి (FAC)

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 30 | 24-04-2023 | పుటలు : 4

పుస్తకమంటే.. ప్రపంచ జ్ఞానం
పుస్తకమంటే.. వ్యక్తిత్వ వికాసం
పుస్తకమంటే.. మానసిక ఆరోగ్యం
పుస్తకం.. చీకటి చిట్టడవిలో
దారిచూపే దీపం
ప్రపంచ పుస్తక దినోత్సవ
శుభాకాంక్షలు
ఏప్రిల్ 23



## మంచిమాట

వర్షాలు కురవాలి, వాగులు వంకలు నిండాలి, పొలాలు పచ్చ పచ్చగా నవ్వాలి, కార్మికుడి కడుపు నిండాలి, పేదవాడికి ఊపిరందాలి, నా అనే భావం మాయం అవ్వాలి, మన అనే భావం మొలకెత్తి వటవృక్షం కావాలి, స్వార్థపు గోడలు నిట్ట నిలువునా కూలిపోవాలి, పరుల కోసం చేసే త్యాగాలు హిమాలయమంత ఎత్తవ్వాలి. చిన్నోళ్ళు పెద్దోళ్ళు, ఇంటివాళ్ళు, ఇరుగువాళ్ళు, పొరుగు వాళ్ళు అందరూ ఆనందంగా ఉండాలి. ఇన్షా అల్లాహ్!!



# నాణ్యమైన ఉన్నత విద్యను అందించేందుకు కృషి చేద్దాం

## ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రరెడ్డి

## ఘనంగా నన్నయ17వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



నన్నయ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


**21.04.23 (మీడియాసెల్)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాలు నాణ్యమైన ఉన్నత విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాయని, దీనిలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ సిబ్బంది అందరూ భాగస్వామ్యం కావాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ 17వ ఫౌండేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యాప్షీ చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రరెడ్డి, వీసీ ఆచార్య జి.వి.ఆర్. ప్రసాదరాజు హాజరై నన్నయ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యువతకు నాణ్యమైన విద్యను అందించి,పని నైపుణ్యాలను పెంచి బయటకు పంపిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని సిఎం జగన్మోహన రెడ్డి ఉన్నత ఆలోచనలకు అనుగుణంగా పని చేస్తున్నామని అన్నారు. భారతదేశంలో ఎక్కడ లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మూడున్నర లక్షల మందిని ఇంటర్న్ షిప్ లను అందజేసామన్నారు.విలువలతో కూడిన విశ్వవిద్యాలయాన్ని నియమించుకోవాలన్నారు. మానవ సంబంధాలతో సంస్థలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఉన్నత ఆలోచనలతో విశ్వవిద్యాలయాలలో పని చేయాలన్నారు. అందరూ విశ్వజనీనమైన ఆలోచనలతో 17వ వసంతంలో విశ్వవిద్యాలయాన్ని నాణ్యమైన విలువలతో కూడిన విశ్వవిద్యాలయంగా నన్నయను అభివృద్ధి చేయాలని సూచించారు. వీసీ ఆచార్య జి.వి.ఆర్. ప్రసాదరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాణ్యమైన ఉన్నత విద్యను అందించేందుకు సిఎం జగన్మోహనరెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. దీనిలో భాగంగా ఎంతో నిబద్ధతతో పని చేసే ఆచార్య కె.హేమచంద్రరెడ్డిని రెండవ సారి యాప్షీ చైర్మన్‌గా నియమించారని తెలిపారు. జర్మనీ యూనివర్సిటీలతో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకొని ఏపీ విద్యార్థులకు మెరుగైన అవకాశాలను కల్పిస్తున్నారని చెప్పారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని సమర్థవంతంగా మందుకు తీసుకువెళ్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని గుర్తు చేసారు. సుమారు నాలుగు వందల అనుబంధ కళాశాలలతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అతిపెద్ద విశ్వవిద్యాలయంగా ఉందన్నారు. అనేక సమస్యలు ఉన్న వాటిని అధిగమించి విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. తాడేపల్లిగూడెం క్యాంపస్ లో ఫార్మసీ, వసతి గృహాల భవనాలను ప్రారంభించామని చెప్పారు. ఆన్ లైన్ పరీక్షా పత్రాలను అందజేసే విధానాలను తీసుకువస్తున్నామన్నారు. 17వ ఫౌండేషన్ డే శుభాకాంక్షలను తెలియజేసారు. అందరి సహకారంతోనే విశ్వవిద్యాలయ అభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ లవ్ అండ్ ఎఫెక్షన్ తో యూనివర్సిటీ అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. ఈసీ మెంబర్, సీడీసీ డీన్ ఆచార్య కె.శ్రీరమేష్ మాట్లాడుతూ 2006 ఏప్రియల్ 22న మాజీ సీఎం దివంగతనేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి యోగి వేమన, తెలంగాణా, నన్నయ యూనివర్సిటీలను ప్రారంభించారనీ, మాజీ మంత్రి దివంగతనేత జక్కంపూడి రామ్మోహనరావు, గోదావరి విశ్వవిద్యాలయ సాధన సమితి కృషి ఫలితంగా నన్నయ యూనివర్సిటీ ఏర్పాటు అయిందన్నారు. యర్త్ డే రోజునే నన్నయ యూనివర్సిటీ ఫౌండేషన్ డే కావడం మరో విశేషమని తెలిపారు. ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి మాట్లాడుతూ మనిషి అశాశ్వతం మానవత్వం శాశ్వతమని, వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రారంభమైన నన్నయ యూనివర్సిటీ అనేక అవరోధాలను అధిగమించి నేడు అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ డా.పి.విజయనిర్మల మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయంలో పరిశోధనలకు మరింత ప్రాధాన్యతన పెరిగి ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. డీన్ ఆచార్య పి.సురేష్ వర్మ మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయం అనేక బాలారిష్టాలను అధిగమించి నేడు ఈ స్థాయికి చేరుకుందని అన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణ స్థలం, ప్రహారి వంటి కొన్ని సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాకినాడ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డా.ఎం.కమలకుమారి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 17వ ఫౌండేషన్ డే శు భాకాంక్షలను తెలియజేసారు. విశ్వవిద్యాలయం ప్రాగణం ఏర్పాటు, భవనాల నిర్మాణం, అడ్మిషన్స్, అనుబంధ కళాశాలలు, కాకినాడ గూడెం ప్రాగణాల ఏర్పాటు, విశ్వవిద్యాలయ గుర్తింపు వంటివి నన్నయ అభివృద్ధికి చిహ్నాలని అన్నారు. డీన్ ఆర్.అండ్.డి సెల్ ఆచార్య కె.రమణేశ్వరి మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ 17వ ఫౌండేషన్ డే శుభాకాంక్షలను తెలియజేసారు. విశ్వవిద్యాలయం, ఉన్నత విద్యాశాఖ సమాజాభివృద్ధి కోసం విద్యార్థుల ఉన్నతి కోసం పని చేస్తున్నాయని అన్నారు. అనంతరం విశ్వవిద్యాలయ అవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలైన క్రీడాకారులకు జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.పి.విజయనిర్మల, డా.పి.వెంకటేశ్వరరావు, డా.ఎం.కమలకుమారి, ఆచార్య కె.శ్రీరమేష్, డీన్స్ ఆచార్య వై.శ్రీనివాసరావు, ఆచార్య పి.సురేష్ వర్మ, డా.ఎ.మట్టారెడ్డి, ఆచార్య కె.రమణేశ్వరి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి, ఈసీమెంబర్ డా.బి.జగన్మోనహనరెడ్డి మరియు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.




ఉపన్యసిస్తున్న ఆచార్య హేమచంద్రారెడ్డి

## సంపాదకీయం




# రంజాన్

నీటిలోపడి తేలుపిల్ల మునిగిపోతుంది.ఆ నీటిలో నిలబడి ఉన్న వ్యక్తి ఆ తేలుపిల్లను రక్షించాలని అరచేతితో పైకి తీశాడు.అది కుట్టింది.ఆయన వదిలేశాడు. మళ్ళీ రక్షించే ప్రయత్నం. మళ్ళీ కుట్టటం ఇలా నాలుగైదు సార్లు జరిగింది. అరచేతి నిండా రక్తం. అది కుట్టటం, ఈయన రక్షించాలనే పంతం వదలడు. దారిన పోతున్న మరోవ్యక్తి ఇది చూసి అది కుడుతుంది కదా.. పోతే పోనీ.. వదిలేయ్.. అన్నాడు. " చిన్న తేలుపిల్ల. కుట్టటమనే తన స్వభావాన్ని అది వదులుకోనప్పుడు ఇంత మనిషిని కాపాడాలనే నా స్వభావాన్ని నేనెందుకు వదులుకోవాలి" అన్నాడు. ఎంత విచిత్రమైన సమాధానం. ఎవరాయన... మహమ్మద్ ప్రవక్త!!

ధర్మాధర్మాలను ప్రబోధించిన ప్రవక్త ఆయన. ఒక సాధారణమైన జీవితాన్ని గడిపారు.కష్టించి పనిచేయటం చిన్నతనం కాదని స్వయంగా నిరూపించారు. తన జీవిత కాలంలోనే అరబ్బులందరిని సంఘటితపరిచి ఐకమత్యంగా ఉండటం నేర్పి వారిని ఒకటిగా చేర్చారు. శరీరంలో ఒక్కొక్క నాళంలో ప్రతి రక్తపు బిందువు ప్రాచీరేకలై భగవంతుని భక్తితో నిండిపోవాలని కోపతాపాలు, మోహాలు విడిపోయి పవిత్రమైన మానవునిగా జీవించాలన్నారు.

ముస్లిం సోదరులు భుజభుజాలు కలుపుకుంటూ ఆలింగనం చేసుకుంటారు. సర్వ మానవుల ప్రేమాలింగనం ఈ ప్రపంచానికి చాలాఅవసరం. సేవించేవాడు, సేవింపబడేవాడు ఒక్కడే. భేదం లేదు. ధనిక పేద,చిన్న పెద్ద తేడాలేవీ లేకుండా మసీదులో అంతా దేవుని ముందు మోకరిల్లుతారు. ఇస్లాం నుంచి ఈ ప్రపంచం నేర్చుకోవాల్సింది ఇదే. పేచీలు లేని జీవితాన్ని గడపాలన్నారు. ముస్లింలకు కులభేదాలు లేవు. పూజ చేయటానికి ప్రతిమ లేదు.నిర్గుణమైన పరమాత్మను పూజించటం. భగవంతునితోనే ప్రత్యక్ష సంబంధం.జిహాద్ అంటే ఆత్మసాక్షాత్కారమే. తనను తానెరిగి ప్రవర్తించటమే. "బిస్మిల్లా హిర్రహమాను నిర్రహీం" నమాజులో ముఖ్యమైన మంత్రమిది. దివ్య ఖుర్ – ఆన్ ఆసాంతం మానవులకు మార్గదర్శకమైంది. అందులోని విశిష్టమైన బోధనలు ఋజుమార్గాన్ని చూపుతాయి. సత్యాసత్యాల వ్యత్యాసాన్ని విడమర్చి తెలుపుతాయి.'హుదల్లిన్నస్' అంటే యావత్ మానవాళి మార్గదర్శక గ్రంథమని అర్థం.

రంజాన్ పర్వదినాల సమయంలో సమస్త మతధర్మాలు మానవాళి ఏకతకు, ప్రశాంతతకు, ప్రపంచ శాంతికి ఆధారం కావాలని సమాజం సమరస భావంతో వర్ధిల్లాలని ఆకాంక్షిద్దాం!!

# నన్నయలో పిహెచ్‌డి పూర్తి చేసిన నైనా జైస్వాల్

### గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందనలు

### పిన్న వయస్సులోనే పిహెచ్‌డి పూర్తిచేయడం ఆనందం : నైనా


గవర్నర్ చేతుల మీదుగా పిహెచ్.డి అవార్డు అందుకుంటున్న నైనా

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం నుండి అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ 22 సంవత్సరాల వయస్సులో పిహెచ్‌డి డిగ్రీ పూర్తి చేసిన భారతదేశంలోనే మొదటి వ్యక్తిగా నిలిచారు.గవర్నర్ కార్యాలయంలో పిహెచ్.డి అవార్డును ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మరియు ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఛాన్సలర్ అబ్దుల్ నజీర్ అందజేసి నైనా జైస్వాల్‌ను అభినందించారు. ఈ సందర్భంగా నైనా జైస్వాల్ మాట్లాడుతూ "భారతదేశంలో 22 సంవత్సరాల వయస్సులో డాక్టరేట్ డిగ్రీ, PhD పొందిన అతి పిన్న వయస్కురాలిగా మరియు మొట్టమొదటి అమ్మాయి అయినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. 'తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి మహిళా సాధికారతలో మైక్రోఫైనాన్స్ పాత్రపై అధ్యయనం'. అనే అంశంపై నన్నయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ఆచార్య ముర్రు ముత్యాలు నాయుడు మార్గదర్శకంలో విజయవంతంగా పరిశోధనను పూర్తి చేసానని అన్నారు. పిహెచ్.డి అవార్డుకు సహకరించిన గవర్నర్ అబ్దుల్ నజీర్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రరెడ్డి, నన్నయ వీసీ ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు, గైడ్ ఆచార్య ముర్రు ముత్యాలు నాయుడు, కోగైడ్ ఆచార్య ఎస్.టేకి, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మరియు నన్నయ విశ్వవిద్యాలయ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఇటువంటి విజయ ప్రస్థానం తనకు 8 సంవత్సరాల వయస్సులో ప్రారంభమైందన్నారు.తాను లండన్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం నుండి 8 సంవత్సరాల వయస్సులో 10వ తరగతి పూర్తి చేసిన ఆసియాలో అతి పిన్న వయస్కురాలుగా, 10 సంవత్సరాల వయస్సులో ఇంటర్మీడియట్ పూర్తి చేసి, 13 సంవత్సరాల వయస్సులో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి భారతదేశంలో పిన్న వయస్సులో పట్టభద్రురాలనయ్యానని తెలిపారు. ఆ తర్వాత ఎం.ఏ పూర్తి చేసి ఆసియాలోనే అతి పిన్న వయస్కురాలిని అయ్యానని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరంలో 16 సంవత్సరాల వయస్సులో పిహెచ్.డి ప్రవేశం పొందానని, ప్రస్తుతం 22 ఏళ్ళ వయస్సులో విజయవంతంగా పిహెచ్.డి పూర్తి చేసానని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పరిశోధన చేసానని, స్వయం సహాయక బృందాలు మరియు మైక్రోఫైనాన్స్‌కు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించానని చెప్పారు.



భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన మరియు మహిళా సాధికారత పరంగా మైక్రోఫైనాన్స్ పాత్ర మరియు ప్రాముఖ్యత చాలా ముఖ్యమైనదని తెలియజేసారు. చిన్నప్పటి నుంచి మంచి పౌరురాలను కావాలని కోరుకునేదాన్ననీ, చదువు పరంగా ఇప్పుడు పీహెచ్‌డీ పూర్తి చేసినందున సివిల్ సర్వీసెస్‌కి వెళ్లాలన్నది నా తదుపరి ఆశయమని అన్నారు. క్రీడలకు సంబంధించి, నేను ప్రస్తుతం నా క్రీడా కెరీర్‌పై ఎక్కువ దృష్టి సారిస్తున్నాను. నేను అనేక అంతర్జాతీయ టోర్నమెంట్‌లు మరియు కామన్వెల్త్ గేమ్స్‌లో కూడా పాల్గొనాలనుకుంటున్నానని తెలియజేసారు. నైనా జైస్వాల్ పీహెచ్‌డీకి గైడ్ పూర్వ ఉపకులపతి ఆచార్య ముర్రు ముత్యాలు నాయుడు మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్శిటీకి వైస్ ఛాన్సలర్‌గా పని చేస్తున్నప్పుడు ఒక మీటింగ్‌లో నైనా జైస్వాల్‌ని కలిశానని, అప్పటికే ఆమె చాలా చిన్న వయస్సులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిందని ఆమె చెప్పినప్పుడు ఆశ్చర్యపోయానన్నారు. ఆమె ఇంకా పరిశోధన చేయాలనే ఆసక్తిని వ్యక్తం చేసిందని వెంటనే ఆమెకు నన్నయ యూనివర్సిటీలో చేరమని ప్రతిపాదన చేశాను. ఆమె తన తల్లిదండ్రులతో చర్చించి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. తరువాత రోజు విశ్వవిద్యాలయానికి ఆహ్వానించి అధికారులతో చర్చించి ప్రత్యేక అడ్మిషన్ ఇవ్వాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. పరిశోధనకు గైడ్ మరియు సూపర్‌వైజర్‌గా ఉండి దాదాపు ఐదు సంవత్సరాలు ఆమెకు మార్గనిర్దేశం చేసానని చెప్పారు. చాలా మంచి టాపిక్‌ని ఎంచుకుని ప్రత్యేక శ్రద్ధతో పరిశోధనను చేసి అద్భుతమైన పుస్తకాన్ని రూపొందించారని చెప్పారు. ఇటీవల ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిష్ణాతులైన మేనేజ్మెంట్ ఆచార్యుల సమక్షంలో పిహెచ్.డి వైవాను నైనా సబ్మిట్ చేసారని తెలిపారు. తన మార్గదర్శకంలో భారతదేశంలోనే అతిపిన్న వయస్సులో పరిశోధన పూర్తి చేసిన తొలి అమ్మాయి నైనా జైస్వాల్ కావడం, ఆమెకు తాను గైడ్ గా ఉండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నైనా మరిన్ని రికార్డులను సొంతం చేసుకొని భారతదేశానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే నైనాను స్ఫూర్తిగా తీసుకొని యువత అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నైనా తల్లిదండ్రులు అశ్విన్ కుమార్ జైస్వాల్, భాగ్యలక్ష్మి, తమ్ముడు అగస్త్య పాల్గొన్నారు.

# ధరిత్రీ దినోత్సవం

**ప్రకృతిః పంచభూతాని గ్రహా లోకాః స్వరాస్తధా!**
**దిశః కాలశ్చ సర్వేషాం సదా కుర్వంతు మంగలం!!**

ప్రకృతిలోని పంచభూతాలు, అంతరిక్షం, గ్రహాలు ఈ విశ్వమంతటికి శుభం జరగాలని మన పూర్వీకులు నిత్య ప్రార్ధనలు చేసేవారు."సర్వేజనాః సుఖినోభవంతు" అని విశ్వః శ్రేయాన్ని కోరారు.

శాస్త్ర సాంకేతిక యుగంలో వస్తున్న మార్పులే గొప్పవనుకుని ప్రకృతిని అశ్రద్ధ చేయవద్దని మహనీయులు ఘోషిస్తున్నారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను ప్రజా జీవనం మీదకి వదలొద్దని, పచ్చని పంట పొలాలను ఉప్పు నీటి క్రయ్యలుగా మార్చవద్దని పర్యావరణవేత్తలు మొత్తుకుంటున్నారు. ఎవరి ఇంటిని వారు కల్మషరహితంగా ఉంచుకోవాలని ప్రబోధిస్తున్నారు. మన పూర్వీకులు ఈ భూమిని తల్లిగా భావించారు.నా పాదాలను నీ మీద మోపుతున్నాను. ఓ భూదేవీ! నన్ను క్షమించు తల్లీ!అని నమస్కరించి పవిత్ర భావంతో మట్టిని స్పృశించారు.




"నిన్ను గూర్చి పాడుకుందు, నన్ను గూర్చి పాడుకొందు, నిన్ను నన్ను కన్నతల్లి నేల గూర్చి పాడుకుందు" అన్నారు సి.నా.రె. నేలమ్మ! నేలమ్మ! నేలమ్మ! నీకు వేల వేల వందనాలమ్మా!! అని పరవశించుకుంటూ పాడారు శ్రీ సుద్దాల అశోక్ తేజ. ప్రకృతిలో పరవశించిన కవులు ప్రకృతికి హాని జరిగితే తట్టుకోలేరు. పరమాద్భుత తత్వాన్ని తనలోని నిబిడీకృతం చేసుకున్న పుడమి మానవునికి ఆవాసమై జీవికనిచ్చింది. అందుకే ఈ భూమి మీద ఉన్న నదులు, సముద్రాలు, మహా సాగరాలు, ఆకాశమార్గాలు, పర్వతాలు దేశాలను వేరు చేస్తున్న సరిహద్దులు కావు. సమైక్యం చేయగల మైత్రీ బంధాలు అవి. విశ్వజనీయమైన మానవ జీవితానికి ఆదర్శ భావనలు. ఆ దృష్టితోనే మన ఋషులు సకల ప్రకృతిని, ప్రపంచాన్ని ఒకే కుటుంబంగా, అఖండంగా, పవిత్రంగా, పరమాత్మ తత్వంగా దర్శించారు.

మనిషికి ప్రకృతి అనేక వరాలను ప్రసాదించింది. ప్రకృతితో సహజీవనం చేస్తున్నప్పుడు నాగరికత కలకాలం వర్ధిల్లుతుంది. కానీ నాగరికత అభివృద్ధి ముసుగులో సహజ వనరుల దుర్వినియోగం పెరిగిపోతే మానవ మనుగడకే ముప్పు తప్పదు. భూమి, నీరు, గాలి, ఆకాశం వీటితో కూడిన ప్రకృతి ఏదైతే ఉందో అది భౌతిక పర్యావరణం. ఆ పర్యావరణం మరణం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత పూర్తిగా మనిషిదే. ఇవాళ మనం తినే ఆహారంతో పాటు పీల్చే గాలి, త్రాగే నీరు కలుషితమైపోతున్నాయి. మన చుట్టూ ఉన్న కాలుష్యం అనేక రూపాలలో వ్యాపించి మనల్ని కబళించడానికి ప్రయత్నిస్తుంది. పంచభూతాలు కలుషితం అవడంతో ప్రకృతి తన సహజ సౌందర్యాన్ని కోల్పోయి దీనాతి దీనంగా విలపిస్తోంది. ఈ విషయాన్ని పట్టించుకోకపోతే చివరికి ఈ భూగోళం నివాసయోగ్యమే కాకుండా పోతుందేమో. దార్శనికులు సామాజిక శ్రేయస్సు, వ్యక్తి యొక్క మోక్షాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రకృతితో సహజీవనం చేయాలని జీవన విధానాన్ని అందించారు. దాని ఆధారంగానే వేల సంవత్సరాలుగా ఈ ప్రపంచ సమాజం జీవిస్తూ వచ్చింది. ప్రస్తుతం ఏర్పడుతున్న సంకట పరిస్థితిని భౌతిక పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని పర్యావరణాన్ని, నిష్కల్మషంగా ఉంచుకుంటూ జీవించాలనే విషయాన్ని ఎవరికి వారు అవగాహన చేసుకోవలసిన సమయం ఇది. పెర్మోంట్ కు చెందిన ప్రాకృతిక వాది జార్జి పెర్కిన్స్ మార్స్ ప్రకృతిని విధ్వంసం చేస్తున్న మనిషి గురించి రాస్తూ.. "మనిషి ఎక్కడున్నా విచ్ఛిన్నకర శక్తి. మనిషి ఎక్కడ అడుగు పెడతాడో అక్కడ ప్రకృతిలోని సమతౌల్యం విపరీతంగా దెబ్బతింటుంది. భూమిపైనున్న అన్ని సంక్లిష్ట జీవుల్లోనూ మనిషి అత్యధికంగా ప్రకృతిని శక్తిహీనంగాచేస్తూ తాను తాను శక్తివంతుడవుతున్నాడు" అని మనిషి - ప్రకృతి గ్రంథంలో అన్నారు.

ఈ ధరిత్రి దినోత్సవ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో మనం భాగస్వామ్యం కావడానికి ప్రయత్నం చేద్దాం.

**- సంపాదకుడు**

# అంబేద్కర్ స్ఫూర్తిదాయక ప్రసంగాలు







భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురించి తెలియని భారతీయులు ఉండరంటే అతిశయోక్తి కాదు.భారత రాజ్యాంగాన్ని రూపొందించి, మన దేశాన్ని ప్రపంచంలోని ఇతర శక్తివంతమైన దేశాల సరసన నిలబెట్టింది ఈయనే. స్ఫూర్తిదాయకమైన ఈయన జీవితం గురించి ఇప్పటికే చాలా పుస్తకాలు వచ్చాయి. కానీ తెలుగు అకాడమీ వారు మూడు సంపుటాలుగా ప్రచురించిన "డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రసంగాలు" పుస్తకాలు మాత్రం అందుకు భిన్నం.ఎందుకంటే ఆయన గురించి,ఆయన ఆలోచనల గురించి అణువణువునా తెలుసుకునే విధంగా ఈ పుస్తకాలు ఉన్నాయనడంలో ఏ సందేహము లేదు. మొదటిసంపుటిలో ఆయన స్వీయ జీవితచరిత్ర గురించి, ఆయనను అనుసరించే యువ, మహిళ అనుచరులకు ఇచ్చిన సూచనలు గురించి, భారతదేశంలో అప్పుడు ఉన్న కుల,మతాల గురించి, ప్రజాస్వామ్యం,విద్యా మొదలైన వాటి గురించి ఆయన ఇచ్చిన ప్రసంగాలు ఈ మొదటి సంపుటి లో ఉన్నాయి. రెండవ సంపుటిలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ గురించి ఆయన ఇచ్చిన ప్రసంగాలు,రాజ్యాంగం గురించి ,సాధారణ చట్టాలు, మహిళలకు ప్రత్యేక రక్షణ చట్టాలు వాటిని ఏవిధంగా ఉపయోగించుకోవాలో మొదలైన వాటి గురించి ఆయన విపులంగా ఇచ్చిన ప్రసంగాలు నిజంగా అత్యద్భుతం. ఇక చివరిదైన మూడవ సంపుటిలో విద్య గురించి, భారతదేశాన్ని పట్టిపీడిస్తున్న అంటరానితనం గురించి, కుల,మత రాజకీయాల గురించి,శాసనసభకు ఎటువంటి వ్యక్తులను పంపాలో..సామాజిక మార్పును ఏ విధంగా తీసుకురావాలో,బాధ్యత గల భారతీయ పౌరుడు ఏ విధంగా ఉండాలో, ఉండకూడదో, ప్రజలు నిర్లక్ష్యంగా ఉంటే దేశం ఎలాంటి కఠిన పరిస్థితులను ఎదుర్కొంటుందో,ప్రజల్లో రాజకీయ చైతన్యం ఏ విధంగా తీసుకురావాలో, గాంధీజీని వ్యతిరేకించడానికి గల కారణాలు గురించి, రాజ్యాంగం రూపొందించే సమయంలో తాను ఎదుర్కొన్న సమస్యల గురించి,అంబేద్కర్ మతం మారడానికి గల కారణాల గురించి ఇలా ఎన్నో ఎన్నో రకాల అంశాల గురించి ఆయన ఇచ్చిన ప్రసంగాలను ఈ సంపుటిలో ప్రచురించడం జరిగింది. భవిష్యత్తులో భారతదేశం ఎలా ఉండబోతుందో ముందే ఊహించి ఆయన రూపొందించిన రాజ్యాంగం ఆయన సమయస్ఫూర్తికి నిదర్శనం.తన జీవిత కాలంలో ఇచ్చిన ప్రసంగాల గురించి రూపొందించిన ఈ పుస్తకం సాహితీప్రియులకు, పెద్దలకు ఒక గొప్ప వరం. భారతీయ పౌరులుగా మనం అంబేద్కర్ ను స్మరించుకోవడం ఎంతైనా అవసరం.

**- బి.సుశాంత్ కుమార్**







**ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 17 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరిగిన వివిధ క్రీడా పోటీలలో విజేతలైన విశ్వవిద్యాలయ బోధన బోధనేతర సిబ్బంది చిత్రమాలిక.**























ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in